రాయిపేటలో సమస్యలతో ఇక్కట్లు

- అధ్వానంగా డ్రెయిన్లు
- రోడ్డు పక్కన ఏపుగా పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు

నరసాపురం: పేరు గొప్ప...ఊరు దిబ్బ అన్నట్టుగా తయారైంది పట్టణంలోని రాయిపేట ప్రాంత వాసుల పరిస్థితి. చెప్పుకోవడానికి పట్టణంలోని ప్రధాన ప్రాంతమైనప్పటికీ అనేక సమస్యలతో ఈ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డ్రెయిన్స్, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలు ఎంతో కాలంగా పరిష్కారం కావడం లేదు. దీంతో స్థానికులు కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయిపేట మొత్తంగా ఎక్కడా కూడా డ్రెయిన్స్ సవ్యంగాలేవు. పూర్వం నిర్మించిన డ్రెయిన్లు శిథిలమయ్యాయి. దీంతో మురుగు నీరు పారడంలేదు. అదీకాక ఈ ప్రాంతంలో ఈ మధ్య కాలంలో ఒక్క మేజర్ డ్రెయిన్ కూడా కొత్తగా నిర్మించలేదు. మరో వైపు పాత డ్రెయిన్స్ లెవెల్స్ సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వర్షం వచ్చిన సమయంలో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. కొత్త డ్రెయిన్స్ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. పైగా ఇది ఉన్నతస్థాయి అధికారులు, బడా కాంట్రాక్టర్లు, పెద్దపెద్ద వ్యాపారులు అత్యధికంగా నివాసముండే ఏరియా కావడం విశేషం.



రాయిపేటలోని క్రిస్టియన్ ఆసుపత్రి వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయిన్



ఉమెన్స్ కళాశాలకు వెళ్లే దారిలో రోడ్డు మార్జిన్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు

పారిశుద్ధ్యం అధ్వానం

ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఉండడానికి రాయిపేటలో ప్రతిచోటా 60 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు ఉంటాయి. రోడ్లకు ఇరు వైపులా ఉండే పిచ్చిమొక్కలు మొత్తం అందాన్ని పోగొట్టడమే కాకుండా, పారిశుద్ధ్య ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. పాత బెరాకా కళాశాల, ఉమెన్స్ కళాశాలలకు వెళ్లే రహదారుల వద్ద పరిస్థితి ఇలానే ఉంది. మున్సిపల్ అధికారులు ఆర్భాటంగా మొక్కలు పెంచుతున్నారు. కానీ ట్రీ గార్డులు ఏర్పాటు చేయకపోవడంతో పాతిన వెంటనే మొక్కలు రక్షణ లేకపోవటంతో చనిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి పెట్టి పని చేస్తున్నాం. ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించి స్థానికంగా ఉండే సమస్యలు తెలుసుకుంటున్నాం. వార్డుల వారీగా పనులు చేసుకుంటూ వస్తున్నాం. కొన్నిచోట్ల కొత్త డ్రెయిన్స్ నిర్మాణం చేయాల్సి ఉంది. అది పాలకవర్గం నిర్ణయం తీసుకోవాలి. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు స్పెషల్ డ్రైవ్స్ పెడతాం.

– ఎం.అంజయ్య, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



దేవ రాజేష్

పోడూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలు పూర్తయినా ఇంత వరకు ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ తుంగలోకి తొక్కారని రాజేష్ విమర్శించారు. మరోవైపు లక్షలాదిమంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ×ఫీజుపోరు॥ఆందోళన కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు.

నరసాపురంలో భయపెడుతున్న కుక్కలు



విక్టరీ మార్కెట్ సెంటర్‌లో రోడ్డుపై గుంపుగా ఉన్న వీధి కుక్కలు

నరసాపురం: పట్టణంలో వీధికుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. దీంతో బయటకు అడుగు పెట్టాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లోనూ వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇక మార్కెట్ ప్రాంతంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇరవై, ముప్పై కుక్కలు గుంపుగా తిరుతున్నాయి. పంజాసెంటర్, కోవెల స్ట్రీట్, జ్యూయలరీ మార్కెట్ ప్రాంతాల్లో ఇలా కుక్కలు గుంపుగా తిరుగుతూ జనాన్ని తరుముతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా స్కూళ్లకు సైకిళ్లపై వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారంపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులకు ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బ్రాడీపేటకు చెందిన బైరెడ్డి సురేష్, అలాగే దారితిప్ప గ్రామానికి చెందిన కె వెంకటరామరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక సహాయం చేయమని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజుని కోరడంతో ఆయన స్పందించి ఇద్దరికి రూ.10వేలు చెక్కులను కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా ఆదివారం రోగి బంధువులకు అందజేశారు. సాయం కోరిన వెంటనే స్పందించి ఆర్థిక సహాయం చేసిన వెంకట్రామరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వాసవీ హోమం



హోమం చేస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: కర్ణాటక ధవనగిరికి చెందిన వాసవీ భక్తులు పెనుగొండలో ఆదివారం వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో ఉదయం నుంచి గోపూజ, మరకత శిల వాసవీమాతకు అభిషేకాలు, కుంకుమార్చనలు, దంపతుల పూజలను ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం యాగశాలలో వాసవీ హోమాన్ని నిర్వహించారు.

అమ్మవారికి సారె సమర్పణ

ఉండి: మండలంలోని వెలివర్రులో ఉన్న వీరాపేరంటాలమ్మకు ఈలంపూడికి చెందిన ముదుండి శ్రీనివాసరాజు దంపతులు 108 రకాల పిండివంటలతో ఆదివారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

విద్యార్థికి చదువే మూలాధారం

భీమవరం: ప్రతి విద్యార్థికీ చదువే మూలాధారమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జనసేన పట్టణ కార్యదర్శి సుంకర రవి అన్నారు. భీమవరం రెడ్డి కాలనీలోని శ్రీసిద్ధి గణపతి ఆలయంలో పంచమిని పురస్కరించుకొని 210 మంది చిన్నారులచే సరస్వతి పూజ చేయించి, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. రవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, అనుకున్న లక్ష్యాలను సాధించేలా పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం అర్చకులు చిన్నారులచే సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రామాయణం రమేష్ బాబు, కొనల చిన్నారి, పంతం ప్రసాద్, గాలి నరసింహారావు, బుర్ర మాణిక్యాల రావు, జక్కా సుబ్బారావు, సాదనాల నాని పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సమైక్యత శిబిరం

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో సోమవారం నుంచి జాతీయ సమైక్యత శిబిరం నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో 12 రాష్ట్రాలకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటారని చెప్పారు.

పెయింటర్స్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న పెయింటర్స్ కుటుంబాలకు సంఘ సభ్యులు స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివిష్ణు గణపతి సంఘం నుంచి రూ.3 వేలు, అలాగే సభ్యుల నుంచి రూ.5700 శీలం వెంకట పెద్దిరాజుకు సంఘం నుంచి రూ.2 వేలు, సభ్యుల నుంచి రూ.1400 ఆదివారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు నీలం రవి, కార్యదర్శి సమతం చంద్రరావు, సభ్యులు కోరుకొండ సుబ్బారావు, తాళ్ల బాలసుబ్రహ్మణ్యం, బొప్పె సాంబమూర్తి, కందికుప్ప బాలాజీ, కాసా కోటి వీరభద్రం పాల్గొన్నారు.

జంతు హింసను నివారించాలి

తణుకు అర్బన్ : జంతు హింసను నివారించి పశువులపై ప్రేమతో వాటి కనీస అవసరాలు తీర్చాలని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాణి ప్రసాద్ అన్నారు. తణుకులోని పశు వైద్యశాల ఆవరణలో ఆదివారం పశు పెంపకందారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత జంతు సంక్షేమ బోర్డు ఆదేశానుసారం వసంత పంచమి రోజును జీవ జంతు కల్యాణ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. మూగజీవులపై ప్రతి ఒక్కరూ దయతో వ్యవహరించాలని, జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మూగజీవులను సంరక్షించి వాటి పోషణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి కొండాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

పెనుగొండ: మండలంలోని దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ వద్ద శ్రీ కొండాలమ్మ ఆలయం 20వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 7వ తేదీ శుక్రవారం వరకూ ఆలయ అర్చకులు పూజ్యం సత్యనారాయణ బ్రహ్మత్వంలో నిర్వహిస్తామని దొంగరావిపాలెం శ్రీ వెంకటేశ్వర కూరగాయల వర్తక సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమ,చామంతులతో పూజలు చేస్తామని పేర్కొన్నారు. ఆఖరి రోజు శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని వివరించారు.

ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 5దీన భీమవరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా, అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేవరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని గుడాల గోపి హెచ్చరించారు. సీఎం చంద్రబాబునాయుడుకి ఇచ్చిన హామీలు అమలు చేసే ఉద్దేశ్యం లేదని తేలిపోయిందన్నారు. గతంలో కూడా ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర చంద్రబాబుదని గోపి దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో ఫీజుపోరు ధర్నాలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.సమావేశంలో పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, బొడ్డు సుబ్బారావు (బాబి), గంగిరెడ్ల ప్రసాద్, లక్కవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి రిక్తహస్తం



ఆందోళన చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

నరసాపురం: దేశంలో చేనేత రంగం సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి రిక్తహస్తం చూపించిందని ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద జోగేశ్వర రావు విమర్శించారు. చేనేతకు అదనపు నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం 18వ వార్డులో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగేశ్వర రావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చేనేత సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని బీజేపీ గతంలో హామీ ఇచ్చిందని చెప్పారు. ఇప్పుడు అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేనేత రంగం సంక్షోభంలో కొట్టిమిట్టాడుతుందని, ఈ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాసా రామలింగం, నిల్లా బుజ్జి. పిచ్చుక చంద్రరావు, సమతం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం సెంటర్లో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు



పాలకొల్లు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతరేకిస్తూ సీపీఎం నరసాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందన్నారు. ప్రత్యేక హోదా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకూ కేటాయింపులు చేయకపోడాన్ని తప్పుబట్టారు. రైల్వేజోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో ఎయిమ్స్ వెనుకబడిన జిల్లాలకు నిధులు, రాజధాని నిర్మాణానికి సాయం వంటి ఊసేలేదని మండిపడ్డారు. రాజదాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదేపదే ప్రస్తావించారే గాని కొత్తగా కేటాయింపు లేదన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు, కేంద్రాన్ని నిలదీయాలని రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొకా శ్రీనివాస్, గుత్తుల నాగేశ్వరరావు, కడలి నాగరాజు, సాగర్, కె నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని, దీంతో యువత ఆశలు ఆడియాశలయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మండిపడ్డారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం ఏఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని విమర్శించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో 22వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, జిల్లా నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా తాడివిన్నీ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పద్మనాభుని పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు గరికి సాధుశేఖర్, సహాయ కార్యదర్శి సాయి, కోశాధికారి యలమల సంసోను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం సీతారామ ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు పద్మనాభుని పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ కళాశాలలో మెరిట్ టెస్ట్



చాంబర్స్ కళాశాలలో మెరిట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. పాలకొల్లు చాంబర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ అంగర చేతుల మీదులుగా విడుదల చేశారు. ఈ పరీక్షకు పాలకొల్లు పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 2436 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరందరికీ పరీక్ష అట్టలు, పెన్నులు కళాశాల యాజమాన్యం అందజేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ సీతారామరాజు, కోశాధికారి రేపాక ప్రవీణ్‌భాను, తటవర్తి కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వర రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తోట వాల్గా పాల్గొన్నారు.

ఆబోతుకు వైద్య పరీక్షలు



ఆబోతుకు వైద్య పరీక్షలు చేస్తున్న వెటర్నరీ వైద్యులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – పూలపల్లి బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఆబోతుకు మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం తణుకు వెటర్నరీ ఆసుపత్రికి ఆదివారం తరలించారు. పూలపల్లి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ వైద్య నిపుణులు డా.జి మల్లేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ వి వరప్రసాద్, గోపాలమిత్రల సహకారంతో పశు సంవర్ధక శాఖకు చెందిన ప్రత్యేక వాహనంలో తణుకు వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన ఆబోతు వెన్నుపూస విరిగినట్లు నిర్ధారించారు. అక్కడ నుంచి పాలకొల్లు వెటర్నరీ ఆసుపత్రికి తీసుకువచ్చి సిలైన్‌లు ఎక్కించి ఆబోతుకు సపర్యలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోధిస్తున్న ఆబోతుకు వైద్య సేవలు అందించడంలో కృషి చేసిన అధికారులకు గోసంరక్షణ సమితి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబోస్‌కు ఘన నివాళి



జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్ సంతాప సభలో నివాళులర్పిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఇటీవల మరణించిన వైస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్ సంతాప సభ ఆదివారం కొంతేరు గ్రామంలోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో నిర్వహించారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ నాయకుడిగా, సొసైటీ అధ్యక్షునిగా, యూత్ క్లబ్ సభ్యునిగా గ్రామాభివృద్ధికి, రైతులకు, కళాకారులకు బోస్ చేసిన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీలకు కులాలకు అతీతంగా గ్రామ నాయకులంతా బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షులు అంబటి మురళీకృష్ణ, గ్రామ పెద్దలు జక్కంశెట్టి శేషబాలసాయి, చంద్రశేఖర్, అశోక్, ఉన్నమట్ల కబర్ధి, బత్తుల రాజు, గంటా శ్రీను, మంచెం చక్రధరరావు, పులపర్తి పెద వెంకటరత్నం, నిమ్మకాయల సత్యనారాయణ, పోలుకొండ ఏలియా భక్తసింగ్, కటికిరెడ్డి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

5న దేశ వ్యాప్త నిరసన

భీమవరం: కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ దేశవ్యాప్త నిరసన చేపట్టిందని పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బ్రిటిష్ కాలం నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు లేబర్ కోడ్లపై ఆందోళన చేస్తున్నాయన్నారు. కార్మిక హక్కులు కాలరాసే విధంగా యజమానులకు కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధంగా లేబర్ కోడ్లు రూపొందించబడ్డాయన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాల మీద దేశ వ్యాప్తంగా రైతాంగం ఆందోళన చేస్తుందని అదే విధంగా కార్మిక వర్గం కూడా లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళన చేయటానికి సిద్ధపడుతుందన్నారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 5న నిరసన కార్యక్రమం చేపట్టామని జిల్లాలో అన్ని మండలాల్లోనూ నిరసన సభలు నిర్వహిస్తామని తెలిపారు.

దాళ్వా సాగులో జింకు లోపం



జింక్ లోపం ఉన్న వరిచేను

పెనుగొండ: దాళ్వా సాగులో జింకు లోపం కనిపిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో జింక్ లోపం కనిపిస్తుండడంతో రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఎం భార్గవ నరసింహయాదవ్, డాక్టర్ పీవీ రమేష్, డాక్టర్ టి.శ్రీనివాస్‌లు పలు సూచనలు చేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా సేంద్రీయ ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గుతూ, రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో ఎరువుల్లో కేవలం నత్రజని, భాస్వరం, పొటాష్‌లు మాత్రమే ఉంటున్నాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. సూక్ష్మ పోషకాలు లేకపోవడం, దీర్ఘ కాలంగా సూటి ఎరువులపై ఆధార పడి సాగు చేయడం వల్ల నేలల్లో సూక్ష్మ పోషకాలు క్రమంగా క్షీణించి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. జింక్ లోపం వల్ల దిగబడి తగ్గి, పంటసరిగ్గా ఎదగదన్నారు. జింక్ వల్ల మొక్క జీవక్రియల్లో అనేక ఎంజైమ్‌లను ఉత్తేజపరుస్తుందని, ఆక్సిన్ వృద్ధి నియంత్రకాల ఉత్పత్తిలో ముఖ్యపాత్ర వహిస్తుందని చెబుతున్నారు. దీంతో జింక్ లోపించినపుడు మొక్కల పెరుగుదల కుంటుపడి, నత్రజని వినియోగం తగ్గడం వల్ల ఆకులు చిన్నవిగా వచ్చి కొన్ని సార్లు నత్రజని లోపాన్ని పోలిఉంటాయి.

జింక్ లోపాన్ని గుర్తించడం ఇలా

జింక్ లోపంతో నాటిన తరువాత మొక్కలు పై నుంచి 3, 4వ ఈనే తెల్లగా పాలిపోయి ఆకుపచ్చ నుంచి పసుపు, లేదా తెల్లగా మారిపోతాయి. తరువాత దశలో ముదురు ఆకు చివరలోయ మధ్య ఈనేకు ఇరుపక్కల తప్పు రంగు లేదా, ముదురు ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. జింకు లోపం ఉన్న ఆకులు చిన్నవిగా, పేలవంగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. కొన్ని సార్లు ఏవిధమైన లోప లక్షణాలు కనిపించకుండా నత్రజని, భాస్వరం, ఎరువులు తగినంతగా వేసినప్పటికీ పైరు ఏపుగా పెరగదు

నివారణ చర్యలు

నాట్లు వేసిన 2–5 వారాల మధ్య చేనుపై జింక్ లోపాన్ని గుర్తిస్తే నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. నాట్లు వేయడానికి ముందు 20 కిలోల జింక్ సల్ఫేట్ ఆఖరి దుక్కులో వేసి ఉండాలి. పైరుపై ఉన్నప్పుడు గుర్తిస్తే లీటరు నీటికి 2 గ్రాముల వంతున జింక్ సల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేయడంతో ఆకులు త్వరగా పోషకాన్ని గ్రహిస్తాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

జింక్‌ను భాస్వరంతో కలిపి చల్లకూడదు. రెండు కలిపి చల్లితే వాటి మధ్య రసాయనికి చర్య జరిగి జింక్ మొక్కలకు అందకుండా పోతుంది. వీటి వాడకం మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. జింక్ సల్ఫేట్ ద్రావణంలో ఎలాంటి తెగుళ్లు, పురుగు మందులు కలిపి పిచికారి చేయకూడదు. ఈ రక్షణ చర్యలను రైతులు పాటించడం వల్ల జింక్ లోపాన్ని నివారించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



ప్రస్తుతం చేలల్లో జింక్ లోపం కనిపిస్తుంది. రైతులు తప్పనిసరిగా శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. ముఖ్యంగా దాళ్వా పంట కాలంలో మొక్కలకు భూమి నుంచి జింక్ తక్కువగా అందుతుంది. రైతులు జింక్ లోపాన్ని గుర్తించిన వెంటనే అధికారులు, శాస్త్ర వేత్తల సూచనలు పాటించి దిగుబడుల పై ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలి.

– బి.నాగరాజు, ఆచంట మండల వ్యవసాయాధికారి